# చదువుల్ నేర్చిన పండితాధముల్

**"హలో** డయానా!" అంటూ లోపలికి వచ్చాడు ఉమ మేనమామ. "ఏమిటి మామయ్యా! కిందటిసారి వచ్చినప్పుడు డయానాస్ లిప్ అని పిలిచావు. ఇప్పుడేమో డయానా అంటున్నావు. నీ ఇంగ్లీషు పాండిత్యమంతా మా మీద ప్రయోగిస్తున్నావు. తెలుగు లిటరేచర్ చదువుకున్న దాన్ని, నాకేం తెలుస్తాయివ్వన్నీ!" అంది ఉమ.

"డయానా అంటే అందానికి దేవత. నీవు చాలా అందమైన దానివని నా ఉద్దేశం. తెలుగులో అయితే 'కుందనపు బొమ్మ', 'చందనపు బొమ్మ' అనుకో" అన్నాడు మామయ్య.

"ఏమిట్రా! అంతా కులాసానా?" అని పలకరిస్తూ "ఈ పూట ఇక్కడ భోంచేసి వెళ్ళు" అంది ఉమ తల్లి.

"దానికేంలే గానీ, ఇంజనీరు గారి అబ్బాయి ఈశ్వర్, ఈ నెల్లోనే వచ్చి పెళ్లి చేసుకుని, మళ్ళీ అమెరికా వెళ్ళిపోతాడట కదూ! అన్నాడు ఉమ మామయ్య.

"అవును! ఈ విషయం నీకెలా తెలిసింది?" అని అడిగింది ఉమ తల్లి.

" ఈ సంబంధం మా కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గారు ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది" అన్నాడు ఉమ మామయ్య.

"ఉమా! మామయ్యకి కాఫీ పెట్టియ్యి. ఆ మాత్రం మర్యాద చేయకపోతే ఎలాగే? రేపొద్దున పెళ్ళి బుట్ట మొయ్యాలి కదా!" అంది ఉమ తల్లి.

" ఏం ఫర్వాలేదు. మన ఉమ అందంగానే ఉంటుంది కదా! అందుకని మన సంబంధం వదులుకోలేరులే" అన్నాడు.

"ఏమో అంతా భగవంతుని దయ! ఇటువంటి మంచి సంబంధానికి అందరూ ప్రయత్నం చేస్తార్లే! అయినా మన ఉమ, ఈశ్వర్ చిన్నప్పటి నుంచీ ఆడుకున్నవాళ్ళు. ఈశ్వర్ నాన్నగారుకూడా మన ఉమ అంటే ఇష్టపడతారు" అంది ఉమ తల్లి.

"ఫర్వాలేదు అన్నీ సవ్యంగానే జరుగుతాయి" అని కాఫీ తాగి వెళ్లిపోయాడు, ఉమ మామయ్య.

పక్కింటి మేడమ్ అంటీ వచ్చారు, ఉమ ఇంటికి. ఆవిడ అంటే కాలనీలో అందరికీ చాలా గౌరవం. అందుకే ఉమ ఈడున్న పిల్లలందరూ ఆమెని "మేడమ్ ఆంటీ" అంటారు. ఆవిడ వస్తూనే "ఏం ఉమా! ఇంక నిన్ను చూడాలంటే మేం అమెరికా రావలసిందేనా? అయినా అది కష్టం అనుకో! అక్కడ మన హైదరాబాద్ బిర్యానీ, మిరపకాయ బజ్జీలు దొరకవు. వీలైనన్నిసార్లు ఇక్కడ లాగించెయ్యి" అంది.

ఆవిడ మాటలకి సిగ్గుపడ్డ ఉమ లోపలికి వెళ్తూ, "అమ్మా! మేడమ్ ఆంటీ వచ్చారు!" అంది.

ఉమ అమ్మగారితో "మీ ఉమ చాలా అదృష్టవంతురాలండీ! ఈశ్వర్ లాంటి బుద్ధిమంతుడు భర్తగా పొందడానికి పూర్వజన్మలో చాలా పూజలు చేసి ఉండాలి! అసలు పార్వతీదేవి కూడా ఈశ్వరుడి గురించి తపస్సు చేసిందంట. వీళ్లపేర్లు కూడా ఆ ఆది దంపతుల పేర్లే! అన్నీ అలా కలిసి రావాలి" అన్నారు ఆంటీ.

"ఏదో మీ దయ వలన ఈ పెళ్లైపోతే మాకింక ఏం కావాలి చెప్పండి!" అంది ఉమ తల్లి.

"అయ్యో! అసలు విషయం మరచిపోయాను ఉమా! 'కుమార సంభవం' పుస్తకం గురించి వచ్చాను. ఒకసారి ఇస్తే చదివి ఇచ్చేస్తాను! అయినా, పెళ్ళి అవ్వకముందు, కుమారసంభవం గురించి మరచిపోవడం సహజమే!" అని ఆ పుస్తకం తీసుకుని నవ్వుకుంటూ వెళ్ళిపోయింది, ఆవిడ.

ఈశ్వర్ అమెరికా నుంచి వచ్చాడు. ఈసారి మాత్రం ఉమ ఇంటికి అతను రాలేదు. ఎప్పుడూ వచ్చేవాడు ఎందుకు రాలేదా అని, ఉమ తల్లిదండ్రులకి దిగులు పట్టుకుంది.

"మీరు వెళ్ళి, ఒకసారి ఈశ్వర్‌ని పలుకరించిరండి! మనం ఆడపిల్ల కలవాళ్లం" అని భర్తను ఈశ్వర్ ఇంటికి పంపింది, ఉమ తల్లి.

అక్కడి వెళ్లి కుశల ప్రశ్నలైన తర్వాత, ఉమ నాన్నగారు ఇంజనీర్‌గారితో "ఒకసారి వచ్చి ఉమని చూడమనీ, మనం చిన్నప్పటి నుంచీ అనుకున్న సంబంధమే కదా" అన్నారు.

ఇంజనీర్ గారు బహు మేధావి. ఆయన అన్నారు "మా ఈశ్వర్ అమెరికా వెళ్ళకముందు, మీ ఉమని మా కోడలుగా చేసుకుందామనే అనుకున్నాం. కానీ మా

ఈశ్వర్ అమెరికాలోనే స్థిరపడదామని నిర్ణయించుకున్నాడు. అక్కడ తెలుగు లిటరేచర్ అవీ చదివిన పిల్లలకి ఉద్యోగాలు రావట. అమెరికాలోనే స్థిరపడిన ఒక తెలుగు కుటుంబంలోని, ఇంజనీరింగ్ చదివిన అమ్మాయిని ఇస్తామన్నారట. వాళ్ళు ఇక్కడికి వస్తున్నారు. ఆ పిల్లవైపే మొగ్గుచూపుతున్నాడు ఈశ్వర్. వాడెన్నుకునే జీవితభాగస్వామి విషయంలో మేమేమీ చెప్పలేకపోతున్నాం!'' అనిచల్లగా చెప్పాడాయన.

''మీరు దయచేసి ఈ పెళ్ళి కుదర్చకపోతే మా అమ్మాయి ఎంత కుమిలిపోతుందో ఆలోచించండి! ఆడపిల్ల మనసు కదా! తన మనసుకి తగిలిన గాయం తట్టుకోలేదు'' అన్నారు ఉమ తండ్రి.

''ఈ విషయంలో నేనేం చెయ్యలేను! పెళ్ళి అనేది ఈశ్వర్ స్వంత విషయం! అదీకాక పదహారేళ్ళు వచ్చిన పిల్లాణ్ణి, తండ్రి స్నేహితుడిగా చూడాలన్న విషయం మీకు తెలియనిది కాదు కదా! అయినానేనొక విషయం చెబుతాను, ఏమీఅనుకోకండి. నిజంగా ఉమ మీద అంత ప్రేమ ఉంటే, ఈశ్వర్ ఇండియాలోనే ఉండేవాడు. హాయిగా తను ప్రేమించిన పిల్ల, అదే, మీ ఉమని పెళ్ళి చేసుకునేవాడు! అయినా జీవితంలో అనుకున్నవన్నీ అయితే ఇక కావాల్సిందేముంది చెప్పండి! మీఉమ, మా ఈశ్వర్ చిన్నప్పుడు ఆడుకున్నమాట నిజమే! నేను కూడా మీ సంబంధానికే ప్రాధాన్యత ఇస్తాను. అమెరికాలో, ఎంత డబ్బు సంపాదించినా చాలదు! మీ ఉమకి అక్కడ ఉద్యోగంరాదు! తెలుగు పద్యాలు గట్టిగా చదువుకుంటూ, ఇంట్లో కూర్చోవాలి!'' అన్నారు ఈశ్వర్ నాన్నగారు.

ఇక ప్రాధేయపడినా ఫలితం లేదని తెలుసుకున్న ఉమ తండ్రి ఇంటికొచ్చేశారు. ఆయన బాధపడుతూ విషయమంతా భార్యతో చెప్పారు. ఆవిడ కూడా ఈవార్త విని తట్టుకోలేకపోయింది. తన కూతురి మనోభావాల్ని ఊహించుకుని బాధపడింది. ఉమకి విషయం తెలిసింది కానీ పైకి మాత్రం ఉసూరుమనలేదు. గంభీరంగా ఉండిపోయింది.

నాలుగు రోజులు గడిచాయి. శుభలేఖలు తీసుకుని ఈశ్వర్ తల్లిదండ్రులు సాదరంగా ఉమ వాళ్ళ కుటుంబాన్ని ఆహ్వానించారు. 'ఇంక ఈశ్వర్‌కి పది రోజులే సెలవు ఉందని మంచి హాలు దొరక్క ఇంటి దగ్గర్లోవున్న హొటల్లోనే పెళ్ళి చేస్తున్నాం' అని చెప్పారు.

సరే! పెళ్ళి రోజు రానే వచ్చింది. అంతా హడావిడి! కానీ పెళ్ళి తంతు మాత్రం పద్ధతి ప్రకారం జరిపిస్తున్నారు. బంతులాటలు ఆడించారు. ఉయ్యాల కూడా వేశారు. చందనం బొమ్మ కావాల్సి వచ్చింది. ఈ తంతు ఉంటుందని తెలియని ఆడపెళ్ళివారు చందనం బొమ్మ మాత్రం తేలేదు. అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటింది. అప్పుడు చందనం బొమ్మ ఎక్కడ దొరుకుతుంది?

ఈశ్వర్, వాళ్ళ అక్క చెవిలో మెల్లిగా ఏదో చెప్పాడు. ఆవిడ ఉమ తల్లిగార్ని తీసుకుని, కార్లో ఉమ ఇంటికి వెళ్ళి, చందనం బొమ్మ తీసుకువచ్చింది. ఆ చందనం బొమ్మతో చిన్నప్పుడు ఈశ్వర్, ఉమ చాలాసార్లు ఆడుకున్నారు. ఇసుకలో గుడి కట్టి ఉత్తుత్తి పెళ్ళిళ్ళు చేసి పప్పు బెల్లాలు పంచి పెట్టారు. ఆ బొమ్మే నిజం పెళ్ళిలో కావాల్సి వచ్చింది.

పెళ్ళి తంతు పూర్తి అయింది. ఉమ కుటుంబం అంకురార్పణ నుంచి అప్పగింతల వరకూ అక్కడే ఉండిపోయారు. మధ్యలో వెళ్ళిపోతే ఈర్ష్యతో వెళ్ళిపోయారని చెడ్డ పేరొస్తుందేమోనన్న భయం! వాళ్ళది చిరకాల స్నేహం!

ఇంటికి వచ్చి మంచం మీద నడుం వాల్చిన ఉమకు 'పడుచుల్ వేడుక బొమ్మ రిండ్లిసుకలో బాగొప్ప నిర్మించి, చొప్పడ ముగ్గుల్ పచరించి ఆడుకొని ఆ పై నాటగొల్లంచు కట్టడముల్ పాడొనరించి....' అనే భక్త చింతామణీ శతకంలోని పద్యం జ్ఞాపకం వచ్చింది.

"ఉమా! నువ్వేం దిగులు పడకు. నీకు మంచి సంబంధం చూస్తాంలే!" అంది ఉమ తల్లి.

"అసలా చందనం బొమ్మఎందుకిచ్చావమ్మా! అది మన పనా! కన్యాదాతలు మీరు కాదు కదా!" అని ఉక్రోషంతో అడిగింది ఉమ.

"పోన్లే తల్లీ! ఎదుటి వాళ్ళకి సాయం చేస్తే వెయ్యింతలై మనకి తిరిగొస్తుంది ఎప్పటికైనా!" అంది ఉమ తల్లి.

పెళ్ళైన తర్వాత, తిరిగి అమెరికా వెళ్ళేటపుడైనా, ఉమా వాళ్ళతో చెప్పకుండా వెళ్ళిపోయాడు ఈశ్వర్.

తర్వాత ఒక రోజు "ఆ చందనం బొమ్మ తీసుకురామ్మా!" అని ఈశ్వర్ ఇంటికి పంపింది ఉమ, తన తల్లిని.

ఆ బొమ్మ గురించి వెళ్ళి వచ్చిన ఉమ తల్లి చెప్పింది "ఆ బొమ్మ ఈశ్వర్ అమెరికా వెళ్ళింతర్వాత కనపడలేదట. ఫ్లైట్‌కి వెళ్ళే ముందు కూడా, ఈశ్వర్ చేతిలో ఆ బొమ్మ అతని తల్లి చూసిందట! బహుశా ముచ్చటపడి ఈశ్వర్ ఆ బొమ్మ అమెరికా తీసుకెళ్ళి ఉంటాడట!"

అది విన్న ఉమ అనుకుంది "నా జీవితం ఒక బొమ్మలాటయిపోయింది. చిన్నప్పటి నుంచీ ఈ సంబంధమే అవుతుందనుకున్నాను. తేడా జరిగితే ఆడపిల్ల మనసెంత కుమిలిపోతుందోనని కూడా తలచలేదు, ఆ మహా ఇంజనీరింగ్ పండితులైన తండ్రీ కొడుకులు! ఆ ప్రాణం ఉన్న మగబొమ్మ దక్కలేదు సరికదా, చిన్నప్పటి నుంచీ ఆడుకున్న చందనం బొమ్మకూడా చేజారిపోయింది.

అప్పుడే వచ్చిన మేనమామతో తన బొమ్మ తన నుంచి వేరైనట్లు చెప్పింది.

"ఏం చేస్తాం! ప్రాణం ఉన్న చందనం బొమ్మ ఇండియాలో ఉండిపోయింది. ప్రాణం లేని చందనం బొమ్మకి రెక్కలొచ్చి ఎగిరిపోయింది" అన్నాడు మేనమామ.

" ఉండు మామయ్యా! కాఫీ తెస్తాను!" అని లోపలికి వెళ్ళబోతుంటే "వద్దులే! మంచి తెలుగు పద్యం చదివి వినిపించవే ఉమా!" అన్నాడు మేనమామ.

ధూర్జటి రాసిన "చదువుల్ నేర్చిన పండితాధముల్" అన్న పద్యం చదివి వినిపించింది ఉమ.

(ప్రియదత్త వారపత్రిక, 2-3-2005)